కొయ్యబొమ్మల కాణాచి మాధవమాల

90 ఏళ్లుగా జీవనాధారం చేసుకున్న కళాకారులు

జీఐ గుర్తింపునకు నేడు గ్రామానికి రానున్న అధ్యయన బృందం



పల్లెల్లో కోడికూతతో నిద్ర లేవడం సర్వసాధారణం. తిరుపతి- శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డుకు సమీపంలోని మాధవమాలలో మాత్రం ఉలి చప్పుళ్లతో గ్రామస్తులు నిద్ర లేస్తారు. ఈ గ్రామంలో ఇంటింటా కళాకారులు దర్శనమిస్తారు. కొయ్యబొమ్మలపై ఈ గ్రామస్తులు చెక్కే అద్భుత కళాఖండాలు ఎవరినైనా ఆకట్టుకుంటాయి. గ్రామాన్ని కొంతకాలం కింద బెల్జియం దేశస్తులు సందర్శించడంతో మాధవమాల అంతర్జాతీయంగా ఖ్యాతి గడించింది.

- ఏర్పేడు

ఏర్పేడు మండలం మాధవమాలలో 90 ఏళ్లుగా కొయ్యబొమ్మలను తయారు చేయడమే వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు ఇక్కడి కళాకారులు. గతంలో కృష్ణయ్య ఆచారి, చిన్నయ్యఆచారి, దొరస్వామి ఆచారి, మునెయ్య ఆచారి తదితరులు గ్రామంలోని రైతులకు కొయ్యనాగళ్లు, గడ్డమానులు, పారలు, తొళికలకు కత్తులు తయారు చేసి ఇచ్చేవారు. అలాగే గ్రామపరిసరాల్లో దొరికే కొయ్యతో చిన్నచిన్న బొమ్మలు తయారు చేసేవారు. వీరి బాటలోనే వారి వారసులు ఇదే వృత్తిని ఎంచుకున్నారు. దానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఆలయాలపై ఉన్న దేవతా మూర్తులు, ధ్వజస్తంభాలు, వినాయకుడు, శ్రీవేంకటేశ్వరస్వామి, అష్టలక్ష్మి, ధనలక్ష్మి, బుద్ధుడు, ఆంజనేయులు, మహావిష్ణువు, శ్రీకృష్ణుడు, పూర్ణకుంభం వంటి కొయ్యబొమ్మలకు మరింత వన్నె తెస్తున్నారు.

2013లో సంక్షేమ సంఘం

మాధవమాలలో బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీ పేరిట 2013లో కళాకారులు ఓ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా లోకనాథం ఆచారి, కార్యదర్శిగా రాజాచారి, చీఫ్ ప్రమోటర్‌గా కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. ఈ గ్రామంతో పాటు గోపాలపురం, పాతవీరాపురం, గుండ్రాళ్లమిట్ట, ఇసుకతాగేలి, అంజిమేడు, కృష్ణంపల్లి గ్రామాలు రేణిగుంట, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, బుచ్చినాయుడుకండ్రిగ మండలాలకు చెందిన 360మందికిపైగా కళాకారులకు కూడా ఈ సంస్థలో సభ్యత్వం ఇచ్చారు. డీఆర్‌డీఏ, నాబార్డు సహకారంతో కళాకారులను గ్రూపులుగా విభజించారు. మాధవమాలలో ఓ పెద్ద భవనాన్ని నిర్మించి అక్కడే కార్మికులకు పని కల్పించారు.

దేశ, విదేశాల్లో ఖ్యాతి :ఆలయాల ధ్వజస్తంభాలు, రథాలు, ప్రధాన ద్వారాలతోపాటు అడుగు నుంచి 15 అడుగుల వరకు దేవతామూర్తుల బొమ్మలను తయారు చేస్తారు. ఈ బొమ్మలను తమ సంస్థ ద్వారా జైపూర్, ముంబై, కోల్‌కతా, రాజస్థాన్ తదితర రాష్ట్రాలో జరిగే ఎగ్జిబిషన్లకు పంపుతారు. అక్కడ నుంచి చైనా, జపాన్, లండన్, అమెరికా వంటి దేశాలకు ఎగుమతి చేస్తారు. దీంతో దేశ, విదేశాల్లో ఈ సంస్థ ఖ్యాతిని గడించడంతో గత ప్రభుత్వంలో 2021 సెప్టెంబరుకు శ్రీబాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీకి అప్పటి ప్రభుత్వం వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించింది.



వినాయకుడి బొమ్మ



వెంకటేశ్వరస్వామి బొమ్మలు



బొమ్మలు చెక్కుతున్న కళాకారులు

'చెక్క'ని కళాకృతులకు చక్కని గుర్తింపు



మాధవమాలతో పెనవేసుకున్న కళానైపుణ్యానికి భౌగోళిక గుర్తింపు (జియోలాజికల్ ఐడెంటిటీ- జీఐ) నిచ్చేందుకు మంగళవారం తొలి అడుగులు పడుతున్నాయి. జీఐగా బ్రాండింగ్ పొందడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు నిపుణులు రానున్నారు. రిసెల్యూట్ సంస్థకు చెందిన శుభాజిత్ సాహో, శ్రీవత్స మంగరాటిలు నిశిత అధ్యయనానికి వస్తున్నారు. జీఐ గుర్తింపు దరఖాస్తుకు వీరు సేకరించి.. సమర్పించే సమాచారం కీలక భూమిక కానుండటం విశేషం. దీంతో వీరి పరిశీలనకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది.

చవితి మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో క్లియరెన్స్ విధానం

అనుమతి కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి: ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 2: వినాయక చవితి మండపాలు లేదా పందిళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తెచ్చిందని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. గతంలో అగ్నిమాపక, పురపాలక, విద్యుత్, పోలీసు శాఖల నుంచి ఎన్‌వోసీలు తీసుకోవాల్సి ఉండేదన్నారు. దీనికోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగాల్సి వచ్చేదని చెప్పారు. నూతన విధానంలో https://ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చిన ఎన్వోసీని ప్రింట్ తీసి మండపం లేదా పందిళ్ల వద్ద ఉంచాలన్నారు. అలాగే 79950 95800 ఫోన్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని సందేశం పంపిస్తే.. ఎన్వోసీ కోసం అనుసరించాల్సిన మొత్తం ప్రక్రియ తెలుస్తుందన్నారు. వినాయక ఉత్సవ నిర్వాహకులు ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజీవ్‌నగర్ అక్రమాలపై సర్వే ప్రారంభం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో కబ్జాదారుల అక్రమాలపై సోమవారం సమగ్ర సర్వే ప్రారంభమైంది. పేదల కోసం కేటాయించిన ఇళ్ల స్థలాలను వైసీపీ నేతలు కొందరు కబ్జాలకు పాల్పడటంపై ఆరోపణలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతో సోమవారం రెవెన్యూ అధికారులు 54 బృందాలతో సర్వే ప్రారంభించారు. ముందుగానే బృందాలను నియమించి వారికి నిర్దిష్ట ఇళ్ల స్థలాల సంఖ్యను విచారణ కోసం కేటాయించారు. సర్వే బృందాలు ప్రతి ఇంటికీ వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. పట్టాలు తమపేరుతో ఉండికూడా స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులు సర్వే బృందాలకు ఫిర్యాదులు అందజేశారు. మొత్తంగా సోమవారం సుమారు 500 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. మరో పదిరోజుల పాటు ఈ బృందాలు రాజీవ్ నగర్‌లో తిష్టవేసి, క్షుణ్ణంగా జల్లెడ పట్టనున్నారు. సమగ్ర సర్వేతో అక్రమాల గుట్టును రట్టుచేస్తామని శ్రీకాళహస్తి తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

టేకాఫ్ సమయంలో ఆగిన విమానం

డోర్ వద్ద స్విచ్‌ని ఓ ప్రయాణికుడు తాకడమే కారణం

తిరుపతి విమానాశ్రయంలో ఘటన

ఏర్పేడు, సెప్టెంబరు 2: తిరుపతి విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం బయల్దేరిన ఓ విమానం టేకాఫ్ సమయంలో అందులోని ప్రయాణికుడి వల్ల ఆగిపోయింది. డోర్ వద్ద స్విచ్‌ను ఆ ప్రయాణికుడు తాకడంతో అది తెరుచుకుని విమానం టేకాఫ్ కాకుండా ఆగిపోయింది. దాంతో ఆ విమానంలోని ప్రయాణికులను విమానాశ్రయ అధికారులు మరో విమానంలో ఎక్కించి పంపారు. స్విచ్‌ని తాకిన ప్రయాణికుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి విమానాశ్రయ అధికారులు సిద్ధమయ్యారు. ఆ ప్రయాణికుడిని ఏర్పేడు పోలీసులకు అప్పగించారు. అయితే దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

శ్రీవారి గరుడ వాహనసేవకు

ఘాట్లలో ద్విచక్రవాహనాల నిషేధం

తిరుమల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామికి ప్రియమైన గరుడ వాహనసేవ రోజున భారీగా వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని తిరుమల రెండు ఘాట్లలోనూ ద్విచక్రవాహనాల రాకపోకలను నిషేధించినట్టు టీటీడీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్నాయి. గరుడసేవను దృష్టిలో పెట్టుకుని అక్టోబరు ఏడో తేదీ రాత్రి తొమ్మిది నుంచి తొమ్మిదో తేదీ ఉదయం ఆరు గంటల వరకు ఘాట్లలో ద్విచక్రవాహనాలు అనుమతించరు.

రూ.1.78కోట్లకు దంపతుల ఐపీ

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 2: తిరుపతి తాతయ్యగుంటలో కాపురం ఉంటున్న చిన్నగొట్టిగల్లు మండలం నల్లపరెడ్డిగారిపల్లెకు చెందిన దంపతులు వి.ఇందిర, వి.చెంగారెడ్డిలు తిరుపతి అడిషనల్ సివిల్‌జడ్జి కోర్టులో రూ.1.78 కోట్లకు ఐపీ దాఖలు చేశారు. న్యాయవాదులు కె.కోటేశ్వరరెడ్డి, పీసీ మురళిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పిటిషనర్‌దారులు కామధేను ఎంటర్‌ప్రైజెస్ పేరుతో హ్యాపీ హెల్త్ ఇండియా ఆర్గానిక్ ప్రొవిజన్స్ వ్యాపారం నిర్వహిస్తుండేవారు. వ్యాపార అభివృద్ధి కోసం అప్పులు చేశారు. దీంతోపాటు ప్రైవేటు చిట్స్, తండలు వ్యాపారాన్ని నిర్వహించారు. చీటీలు పాడి డబ్బులు తీసుకున్నవారు తండలకు తీసుకున్న వారు డబ్బులు చెల్లించకపోవడంతో వీరు తీవ్రంగా నష్టపోయారు. అప్పులు తీసుకున్న వారి నుంచి ఒత్తిడి తీవ్రంకావడంతో ఐపీ దాఖలు చేశారు. ఇందులో 17మందిని ప్రతివాదులుగా చూపించారు.

తాగొచ్చి భర్త పెట్టే వేధింపులు తట్టుకోలేక..

తల్లిదండ్రులతో కలిసి కొట్టి చంపేసిన భార్య

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 2: రోజూ మద్యం తాగి రావడం.. తనతోపాటు బిడ్డలను వేధించడం.. ఏళ్ల తరబడి కొనసాగుతుండటంతో తట్టుకోలేక పోయిందో భార్య. చివరకు తల్లిదండ్రులతో కలిసి భర్తను కొట్టి చంపేసింది. ఈ ఘటన తిరుపతిలో జరిగింది. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేసే మదనపల్లెకి చెందిన సుబ్రహ్మణ్యంకు అరగొండకు చెందిన సుజాతతో 13ఏళ్ల కిందట వివాహమైంది.వీరికి ఇద్దరు పిల్లలు. కుమారుడు రోహిత్.. 5వ తరగతి, కుమార్తె రోహిణి.. 4వతరగతి చదువుతున్నారు.వీరి కుటుంబం ప్రస్తుతం తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌లో నివసిస్తోంది. కొన్నేళ్లుగా సుబ్రహ్మణ్యం రోజూ సంపాదించిన డబ్బుతో మద్యం తాగడం, జులాయిగా తిరుగుతూ.. భార్య బిడ్డలను వేధించేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక విషయాన్ని తన తల్లిదండ్రులైన జయమ్మ, నాగరాజుకుచెప్పి సుజాత వాపోయింది.ఆపై తల్లిదండ్రులను ఇంటికి పిలిపించింది.ఈ క్ర మంలో ఆదివారం రాత్రి కూడా భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. సుజాత తల్లిదండ్రులు మందలించినా సుబ్రహ్మణ్యం వినలేదు. దాంతో తల్లిదండ్రులతో కలిసి సుజాత తన భర్తను పెద్ద కర్రతో కాళ్లు, చేతులు, తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.జరిగిన విషయా న్ని స్థానికులు డయల్ 100కు ఫోన్‌చేసి తెలిపారు. బ్లూ కోల్ట్స్ పోలీసుల సమాచారంతో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సీఐ మహేశ్వర్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్యకు కారణమైన సుజాత, జయమ్మ, నాగరాజును సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది

పలు రైళ్ల రద్దు

దారి మళ్లింపుతో ఆలస్యంగా నడిచిన మరికొన్ని

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 2: విజయవాడలో కురిసిన భారీవర్షాలకు సోమవారం పలు రైళ్లు రద్దవగా, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను దారిమళ్లించారు. మరో మూడు రైళ్లు నిర్ణయించిన సమయంకంటే ఆలస్యంగా నడిచినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి నుంచి విజయవాడ మీదుగా వివిధ ప్రాంతాలకు రోజువారీగా రాకపోకలు నిర్వహించే తిరుమల, పూరి, కృష్ణా, కాకినాడ, హౌరా ఎక్స్‌ప్రెస్‌లు, విశాఖపట్టణం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. సికింద్రాబాదు-తిరుపతి మధ్య నడిచే పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను నడికుడి, గుంటూరు, తెనాలి మీదుగా దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. సోమవారం తిరుపతినుంచి సికింద్రాబాదుకు మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరాల్సిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్(20702) రాత్రి 8.15 గంటలకు బయల్దేరింది. తిరుపతి-సికింద్రాబాద్ మధ్య నడిచే సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం3.35గంటలకుబయల్దేరాల్సి ఉండగా, సాయంత్రం 6.05 గంటలకు బయల్దేరింది. అలాగే తిరుపతి-హిస్సార్‌ల మధ్య నడిచే స్పెషల్ ఎక్స్‌ప్రెస్(04718) రాత్రి 11.45 గంటలకు బయల్దేరాల్సి ఉండగా, మంగళవారం వేకువజామున బయల్దేరినట్లు అధికారులు తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ చెప్పారు. రద్దయిన రైలు ప్రయాణికులకు రైల్వే నిబంధనల మేరకు పూర్తి రీఫండ్ చేస్తున్నామన్నారు.

పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో అపశ్రుతి

ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం

ఓ అభిమాని మృతి, మరొకరికి గాయాలు

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు, బాధితుడికి రూ.50వేల సాయం ప్రకటించిన జనసేనాని



గోపి (ఫైల్ ఫొటో)



గాయపడ్డ మధు

రామచంద్రాపురం/తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. రామచంద్రాపురం మండలం అనుపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం జనసేనాని జన్మదిన వేడుకల్లో భాగంగా ఆయన అభిమానులు గోపి (32), మధు (35) పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. గోపి అక్కడికక్కడే మృతి చెందగా, మధు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఐదుగురు అభిమానులు ఫ్లెక్సీ కడుతుండగా.. గోపి, మధు విద్యుదాఘాతానికి గురయ్యారు. వీరిద్దరూ పవన్ కల్యాణ్ వీరాభిమానులు. విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు ఆస్పత్రి వద్దకు ఆస్పత్రికి భారీగా తరలివెళ్లారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆస్పత్రిలో బాధిత కుటుంబీకులను జనసేన నాయకులు కిరణ్ రాయల్, పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, తదితరులు పరామర్శించారు. మృతిచెందిన గోపి కుటుంబానికి రూ.5 లక్షలు, గాయపడిన మధుకు రూ.50వేల ఆర్థిక సాయాన్ని పవన్ కల్యాణ్ ప్రకటించినట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యేల పరామర్శ : రుయాస్పత్రిలో బాధిత కుటుంబాలను తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి చెరో రూ.లక్ష సాయాన్ని ప్రకటించారు. గోపి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం వచ్చేందుకు కృషి చేస్తామని పులివర్తి నాని హామీ ఇచ్చారు. అలాగే గాయపడ్డ మధుకు మెరుగైన వైద్యం కోసం అమర ఆస్పత్రికి తరలించి, పూర్తి ఖర్చులు తానే భరిస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కూడా బాధితులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ2లక్షలు, గాయపడ్డ వ్యక్తికి రూ.50వేల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు.

విజయవాడలో తిరుపతి విద్యుత్ ఉద్యోగుల సేవలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 2: విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ సరఫరాను తిరుపతి సర్కిల్ బృందాలు పునరుద్ధరిస్తున్నాయి. సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఆదేశాలమేరకు సోమవారం తిరుపతి సర్కిల్, తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ ఎస్.వాసురెడ్డి ఆధ్వర్యంలో మూడు బృందాలు విజయవాడ భవానీపురంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. సోమవారం విజయవాడ నుంచి ఈఈ వాసురెడ్డి మాట్లాడుతూ.. పురవీధుల్లో వరదల కారణంగా నీటమునిగిన ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రవాహం తగ్గిన వెంటనే మరమ్మతులు చేశామని తెలిపారు. తనతోపాటు డీఈఈ సతీష్, ఏఈలు టి.నాగరాజు, కుమార్‌బాబు, మునికుమార్, ప్రశాంత్‌లతోపాటు 30 మంది వోఅండ్ఎం ఉద్యోగులు పాల్గొన్నారని ఆయన చెప్పారు.



విజయవాడ భవానీపురంలో జరుగుతున్న పనుల్లో తిరుపతి ఉద్యోగులు

జలకంఠేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం



రామచంద్రాపురం, సెప్టెంబరు 2: సోమావతి అమావాస్య సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొల్పి స్నపన తిరుమంజనం నిర్వహించాక ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎల్‌పీటీ విభాగానికి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్‌ మంజూరు



ఇన్‌చార్జి వీసీ జేవీరమణ నుంచి సర్టిఫికెట్‌ అందుకుంటున్న విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్‌, సెప్టెంబరు 2: ఎస్వీ వెటర్నరీ పరిధిలోని వెటర్నరీ కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతికశాస్త్ర విభాగం(ఎల్‌పీటీ)ఆధ్వర్యంలో నడుస్తున్న మాంస ఉత్పత్తుల విక్రయశాలకు ఫుడ్‌సేఫ్టీ అండ్‌ స్టాండర్డ్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా (ఆహారభద్రతాప్రమాణాల చట్టం) లైసెన్స్‌ని మంజూరు చేసింది. ఈకేంద్రంలో విక్రయించే మాంస ఉత్పత్తులను (సాసేజులు, నగెట్స్‌, వడలు, మాంసపు ఊరగాయలు, స్వచ్ఛమైన పందిమాంసం) ఫుడ్‌సేఫ్టీ అధికారులు పరిశీలించి లైసెన్స్‌ని మంజూరు చేశారని ఎల్‌పీటీ విభాగ హెడ్‌ డాక్టర్‌ జి.వి జయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ జేవీరమణ, డీన్‌ డాక్టర్‌ కె.వీరబ్రహ్మయ్య, అసోసియేట్‌డీన్‌ డాక్టర్‌ పి.జగపతి రామయ్యల చేతులమీదుగా విజయభాస్కర్‌రెడ్డి ఈసర్టిఫికెట్‌ని అందుకున్నారు. వర్సిటీ ప్రధానగేటు వద్ద ఉన్న మాంస ఉత్పత్తుల విక్రయశాలలో వీటిని విక్రయించనున్నారు. విజయభాస్కర్‌రెడ్డితో పాటు విభాగ అధ్యాపకులు, సిబ్బందిని ఇన్‌చార్జి వీసీ తదితరులు అభినందించారు.

వెటర్నరీలో సీసీవీఈసీకి ఉత్తమ సహకారసంస్థ అవార్డు



ఐసీఏఆర్‌ డీడీజీని అవార్డుని అందుకుంటున్న వెటర్నరీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ సుజాత

తిరుపతి రూరల్‌, సెప్టెంబరు 2: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని నిరంతర పశువైద్యవిద్య, సమాచార కేంద్రానికి 2023-24కిగాను జాతీయస్థాయిలో ఉత్తమ సహకారసంస్థ (బెస్ట్‌ కొలాబ్రేటింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌ అవార్డ్‌) అవార్డు లభించింది. హైదరాబాద్‌కి చెందిన ఐసీఏఆర్‌-నార్మ్‌ (నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ అగ్రికల్చరల్‌ రీసెర్చ్‌ మేనేజ్‌మెంట్‌) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అత్యుత్తమ పనితీరు, జాతీయస్థాయి శిక్షణా కార్యక్రమాల నిర్వహణలో గణనీయమైన ప్రతిభకు గుర్తింపుగా సీసీవీఈసీకి ఈఅవార్డుని అందజేశారని కేంద్రం కోఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ కె.సుజాత పేర్కొన్నారు. న్యూఢిల్లీకి చెందిన ఐసీఏఆర్‌ డీడీజీ (ఎడ్యుకేషన్‌) డాక్టర్‌ ఆర్‌సీ అగర్వాల్‌, నార్మ్‌డైరెక్టర్‌ డాక్టర్‌ సీహెచ్‌ శ్రీనివాసరావుల చేతులమీదుగా తాను ఈ అవార్డుని అందుకున్నట్లు ప్రకటించారు. ఇన్‌చార్జి వీసీ జేవీరమణ, ఇతర వర్సిటీ అధికారులు ఈమెతోపాటు సిబ్బందిని అభినందించారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి: సీపీఐ



కలెక్టరేట్‌ వద్ద ధర్నాచేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 2: చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీ నిత్యావసర వస్తువులను తగ్గించి సామాన్య ప్రజలను ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్‌ చేశారు. అధిక ధరలకు నిరసనగా సీపీఐ దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వారు స్థానిక కలెక్టరేట్‌ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి దేశంలో ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజలపట్ల కాదని, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని విమర్శించారు. అధిక ధరల భారంతో ప్రజల జీవితాలు కుదేలవుతున్నాయన్నారు. దేశ ప్రజలపట్ల ఏమాత్రం ప్రేమున్నా ప్రధాని 2014 నాటి ధరలకు సమానంగా నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్‌ చేశారు. లేదంటే సీపీఐ దేశవ్యాప్తంగా ఉద్యమిస్తుందని చెప్పారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈకార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, బండి చలపతి, నదియా, నగర కార్యదర్శి విశ్వనాథ్‌, ఏఐటీయూసీ నగర కార్యదర్శి రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌ నియామకం



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న ప్రొఫెసర్‌ విజయసారథిరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 2: ఎస్వీయూ బయో కెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్‌ ఓబుళం విజయసారథిరెడ్డి ఆ వర్సిటీ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్‌ భూపతి నాయుడు నుంచి సోమవారం ఆయన అందుకున్నారు. ఔషధ మొక్కలు, బయాలజీ, ఫెర్మెంటేషన్‌ అంశాలపై ప్రత్యేక అధ్యయనం చేశారు. 1992లో వర్సిటీలో అధ్యాపకులుగా చేరారు. అంతకుముందు మైసూరులో పీహెచ్‌డీ, ఇటలీలో పీడీఎఫ్‌ చేశారు. 19 పీహెచ్‌డీలకు పర్యవేక్షకులుగా పని చేశారు. వందకు పైగా పరిశోధనా వ్యాసాలు, రెండు పుస్తకాలు రాశారు. ఈ నేపథ్యంలో ఈయనను ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు.

రెండు లడ్డూల నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి

● బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి



తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 2: దర్శనం చేసుకోని భక్తులకు ఆధార్‌ కార్డుపై రెండు లడ్డూలను మాత్రమే ఇస్తామని టీటీడీ ప్రకటించడం సమంజసం కాదని బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రద్దీ కారణంగా కొన్ని సందర్భాల్లో వెంకన్న దర్శనం కష్టమైన భక్తులు అఖిలాండం వద్ద టెంకాయి మొక్కులు చెల్లించి వెళుతుంటారన్నారు. ఇలాంటి వారికి రెండు లడ్డూలిస్తామనే నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు. లడ్డుకు డిమాండ్‌ సృష్టిస్తే దళారులు పుట్టుకొస్తారని అభిప్రాయపడ్డారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకొచ్చానన్నారు. అసౌకర్యం కలగకుండా చూస్తానని మంత్రి తెలిపారన్నారు.

విద్యుత్‌ కాంట్రాక్ట్‌ కార్మికుల రిలే దీక్షలు



తిరుపతి(ఆటోనగర్‌)సెప్టెంబరు2: సదరన్‌ డిస్కం కాంట్రాక్ట్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని,షిఫ్ట్‌ ఆపరేటర్లకు వేతనాలు పెంచాలని సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్‌ చేశారు. తిరుపతి విద్యుత్‌ సర్కిల్‌ కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాచ్‌మెన్ల నుంచి షిఫ్ట్‌ఆపరేటర్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారు ఏళ్ళ తరబడి వాచ్‌మెన్‌ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. పాత షిఫ్ట్‌ ఆపరేటర్ల వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కార్మిక సంక్షేమం కోసం ఏమీ చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్ట్‌ కార్మికుల సమ్యలను పరిష్కరించాలన్నారు. ఈనెల 5 వరకు దీక్షలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులు చేరుకొని కార్పొరేట్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తారన్నారు. నాయకులు శివకుమార్‌ రెడ్డి, నూర్‌బాష,కుమార్‌, ఎస్‌.నది, సుదర్శన్‌, సోము,మురళి పాల్గొన్నారు.

ఖాళీ టిన్నుల విక్రయానికి టెండర్ల ఆహ్వానం

తిరుమల, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్నుల విక్రయానికి టీటీడీ సీల్డ్‌ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్‌ పొందిన వారు టీటీడీ వినియోగించిన ఖాళీ టిన్నులను సేకరించవచ్చు. తిరుపతిలోని హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్‌ వేలం కార్యాలయంలో సీల్డ్‌ టెండర్లు ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయాల్సిఉంటుంది. ఇతర వివరాలకు 0877 2264429 నెంబరును సంప్రదించాలని టీటీడీ సూచించింది.

డీకేటీ భూముల్లో అక్రమ నిర్మాణాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



మల్లయ్యపల్లె వద్ద అక్రమ నిర్మాణం

చంద్రగిరి, సెప్టెంబరు 2: మల్లయ్యపల్లె సమీపంలో డీకేటీ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సర్వే నెంబరు 10-16, 10-28లో సుమారు మూడు ఎకరాల డీకేటీ భూమి ఉందని, అయితే మల్లయ్యపల్లె గ్రామానికి చెందిన ఓవ్యక్తి ఆ భూమిలో ఆగమేఘాల మీద కమర్షియల్‌ భవన నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రగిరి, అనుప్పల్లె రహదారికి డీకేటీ భూమి ఆనుకోని ఉండటంతో ఆ భూమి చాలా విలువైందన్నారు. వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ భూమిలో యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టడం తగదంటున్నారు. దీనిపై తహసీల్దార్‌ శివ రామసుబ్బయ్యను వివరణ కోరగా డీకేటీ భూముల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. ఇది వరకే సంబంధిత వ్యక్తికి తెలిపామన్నారు. చట్టపరంగా నోటీసులు జారీ చేసి అక్రమ నిర్మాణాలు నిలిపివేతకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా పవన్‌ కల్యాణ్‌ జన్మదిన వేడుకలు



చంద్రగిరిలో ఎమ్మెల్యే నానికి కేక్‌ తినిపిస్తున్న నాయకులు

చంద్రగిరి, సెప్టెంబరు 2: మండలంలో డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ జన్మదిన వేడుకలను టీడీపీ, జనసేన పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరిలో జనసేన నాయకులు యండమూరి నాగేంద్ర, శరణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు గోపిరాయల్‌ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొమ్మల కిషోర్‌ ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. అంతకుముందు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. శ్రీనివాస మంగాపురంలో జనసేన నాయకులు మబ్బు లోకేష్‌రాయల్‌ ఆధ్వర్యంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి బీగాల అరుణ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు సుబ్రమణ్యం నాయుడు, సురేష్‌రెడ్డి, దేవర మనోహర్‌, ఆకేపాటి సుభాషిణి, మురళి, ఈశ్వర్‌ రాయల్‌, నిరంజన్‌, బుజ్జీ, గురునాథం,హేమంత్‌ పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెం: తలకోన రోడ్డు మార్గంలోని సచివాలయం వద్ద నాయకులు కేక్‌ కట్‌ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జెఎస్పీ కార్యదర్శి కల్ప రవి, మండల అధ్యక్షుడు ముండ్లపాటి మురళి ఆధ్వర్యంలో సందడిగా జరిగిన వేడుకల్లో కూటమి నాయకులు గోవర్ధన్‌,ప్రసాద్‌, ప్రసాద్‌ రెడ్డి,తిరుమలేశ్‌ రెడ్డి,నాగార్జున రెడ్డి, జయపాల్‌ రెడ్డి, నాగరాజ నాయుడు,మనోజ్‌ కుమార్‌, జీవన్‌ కుమార్‌ శ్రీకాంత్‌, కంచన ఈశ్వరయ్య, రెడ్డి ప్రసాద్‌ ,శంకర్‌, రనాజు, దేశిరెడ్డి గోపి, గడ్డం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో సంస్కృతవర్సిటీ విద్యార్థులకు పతకాలు



పతకాలు పొందిన విద్యార్థులతో వీసీ కృష్ణమూర్తి, అధ్యాపకులు

తిరుపతి రూరల్‌, సెప్టెంబరు 2: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్‌ సీనియర్‌ మెన్‌ అండ్‌ ఉమెన్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీల్లో వివిధ కేటగిరీల్లో తమ విద్యార్థులు 14 పతకాలను సాధించారని ఏపీఆర్వో డాక్టర్‌ కె.కుమార్‌ పేర్కొన్నారు. దీనిలో ఒకవిద్యార్థి స్వర్ణపతకం, ఐదుగురు రజిత, 8మంది కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. విద్యార్థులను వీసీ జీఎస్‌ఆర్‌ కృష్ణమూర్తి, స్పోర్ట్స్‌ సెక్రటరీ వి.సేతురామ్‌, రిజిస్ట్రార్‌ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్‌ డీన్‌ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్‌ వెల్ఫేర్‌ డీన్‌ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, బి.రవినాయుడు తదితరులు అభినందించారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

జాతీయ సంస్కృత వర్సిటీలో పద్మావతి మహిళా వర్సిటీ అధ్యయన విభాగం సహకారంతో సోమవారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్విమ్స్‌ కార్డియాలజీ ప్రొఫెసర్లు డాక్టర్‌ వనజ, డాక్టర్‌ వరుణ్‌లు హాజరై మాట్లాడుతూ.. మనిషికి గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్‌ ద్వారా ప్రాణాన్ని రక్షించవచ్చని, దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. గుండె ఆగిపోవడం, వాయుమార్గాలు అడ్డుకోవడం వంటి క్లిష్ట పరిస్థితి ఎదురైనప్పుడు సీపీఆర్‌ ప్రాముఖ్యతని వివరించారు. విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. వీసీ జీఎస్‌ఆర్‌ కృష్ణమూర్తి, పద్మావతి వర్సిటీ ఉమెన్‌స్టడీస్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ పి.నీరజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు నాశనం

●పద్మావతి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 2: మత్తు పదార్థాలకు బానిసైతే యువత భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకున్నట్టేనని పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ ఉమ అన్నారు. మత్తు పదార్థాల నివారణపై సోమవారం ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే సమస్యలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్ర మహిళా కమీషన్‌ ఛైర్‌ పర్సన్‌ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు విక్రయించడం, యువత బానిసై భవిష్యత్తును చెడగొట్టుకోవడం బాధ కలిగిస్తున్నాయన్నారు. మహిళలపైనా చిన్నారులపైనా అనేక దారుణాలు జరగడానికి మత్తు పదార్థాలే ప్రధాన కారణమన్నారు. ఏఎస్పీ రాజేంద్ర,ఎక్సైజ్‌ అధికారి జానకీరాం, రిజిస్ట్రార్‌ రజని, డీన్లు వాణి, కాత్యాయిని, ఉమెన్‌ రక్షణ కేంద్రం డైరెక్టర్‌ సీతా కుమారి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌ బంతి తెచ్చిన తంటా

వి.కోటలో ఉద్రిక్తత ● పర్వసర దాడులు.. దుకాణాల ధ్వంసం..

● అర్ధరాత్రి 12.30 గంటలు దాటాక ఆందోళన విరమణ



రెండోసారి జరిగిన దాడిలో గాయపడిన బాధితులు

వి.కోట, సెప్టెంబరు 2: వి.కోటలో క్రికెట్‌ బంతి సమీపంలోని ఒక మహిళకు తగిలిన సంఘటన పెద్ద వివాదంగా మారిపోయి ఘర్షణలకు దారితీసింది. ధర్నాలు దుకాణాలు, వాహనాలపై దాడులతో ఉద్రిక్తంగా మారింది. సోమవారం సాయంత్రం భర్త మధుసూదన్‌తో కలిసి బజారుకు వెళ్లి వస్తున్న జ్ఞానప్రసూనాంబకు క్రికెట్‌ బంతి తగిలింది. దీంతో వారు క్రికెట్‌ ఆడుతున్న యువకులను మందలించారు. మాటామాటా పెరిగి క్రికెట్‌ ఆడుతున్న యువకులు దంపతులపై దాడికి దిగారు. వీరు ఇంటికి పరుగుతీసి గడియ పెట్టుకున్నారు. యువకులు ఇంటి మీద దాడి చేశారు. చుట్టుపక్కల వారు అడ్డుకోవడంతో వారి మీదా కర్రలతో, రాడ్లతో దాడి చేశారు. గాయపడిన వారు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల తరపున పెద్ద సంఖ్యలో వారి బంధుగణం స్టేషన్‌ వద్దకు చేరుకుంది. ఈలోగా దాడి దృశ్యాల వీడియోలను సోషల్‌ మీడియాలో పోస్టు చేశారు. ఓ వర్గం పై మరో వర్గం దాడి చేసిందని, దీనిని ప్రశ్నించే వారే లేరా అంటూ పిలుపునివ్వడంతో ఈ వివాదం మతం రంగు పులుముకుంది. చుట్టపక్కల గ్రామాల నుంచి వందలాదిగా స్టేషన్‌ వద్దకు చేరుకున్నారు. కేసునమోదు చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. ఇంతలో కొందరు యువకులు దాడి చేసిన వారున్న మసీదు వీధికి చేరుకున్నారు. గొడవ చేసిన వారిపై చర్యలు తీసుకుంటే తమకు అభ్యంతరం లేదని, అయితే మసీదు వద్ద నినాదాలు చేయడం సరికాదని అక్కడివారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అంతలో కొందరు ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో పాపేపల్లెకు చెందిన బాలరాజు, మహేష్‌, వి.కోటకు చెందిన సురేష్‌, బీజేపీ నేత రామచంద్రుడుతో పాటు మరి కొందరు గాయపడ్డారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

జాతీయ రహదారిపై ధర్నా.. దాడులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న చిత్తూరు కలెక్టర్‌, ఎస్పీ

పోలీసులు మెతక వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బాధితులు, వారి బంధువులు అంబేడ్కర్‌ సర్కిల్‌ వద్ద జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు.గాయపరచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నినదించారు. దీంతో వాహనాల రాకపోకలు ఆగాయి. పోలీసులు ఎంత నచ్చజెప్పినా ధర్నా చేస్తున్న వారు వినకపోవడంతో పరిస్థితి విషమించింది. ఇదే అదునుగా కొందరు పలు దుకాణాలను ధ్వంసం చేశారు. మరి కొందరు ఆటోలు, ఇతర వాహనాల అద్దాలను పగుల గొట్టారు.

రాయి తగిలి డీఎస్పీకి తీవ్రగాయాలు



గంటలకొద్దీ ట్రాఫిక్‌ స్తంభించడంతో పలమనేరు ఆర్డీవో మనోజ్‌ కుమార్‌రెడ్డి వి.కోటకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ఆందోళనకారులపైకి మరో వర్గం రాళ్లు రువ్వింది. దీంతో అక్కడ వేచి ఉన్న యువకులు వారి వైపు దూసుకెళ్లారు. దీంతో పోలీసులు అటువైపు వెళ్లకుండా వీరిని అడ్డుకున్నారు. అటువైపు నుంచి వచ్చిన రాయి పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌ తలకు తగలడంతో తీవ్ర రక్తస్రావంతో ఆయన ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి మరింత క్షీణించడంతో అదనపు బలగాలు వి.కోటకు చేరాయి. రాత్రి 10.45 గంటలప్పుడు కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌, ఎస్పీ మణికంఠ వి.కోటకు చేరుకుని డీఎస్పీని పరామర్శించారు. ఆందోళనకారుల వద్దకెళ్లి సుదీర్ఘంగా చర్చించి.. వారిని ఒప్పించారు. దీంతో రాత్రి 12.30 గంటల సమయంలో ఆందోళన విరమించారు. వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.



రామచంద్రాపురం మండలం అనుపల్లెలో జరిగిన పవన్‌ కల్యాణ్‌ జన్మదిన వేడుకల్లో చోటుచేసుకున్న ప్రమాదంలో మృతి చెందిన గోపి కుటుంబీకులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - గోపి మృతదేహం - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.06 కోట్లు

తిరుమల, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.06 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 74,498 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 25,355 మంది తలనీలాలు సమర్పించారు.

అబాకస్‌ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 2: అబాకస్‌ ఆన్‌లైన్‌ పోటీలలో నగర విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక బాలాజీకాలనీలోని శ్రీ వేంకటేశ్వర యూసీమాస్‌ అబాకస్‌కి చెందిన విద్యార్థులు గత నెల 31న గుంటూరులో జరిగిన లిస్టనింగ్‌, ఫ్లాష్‌ పోటీలలో పాల్గొన్నారు. ఈ క్రమంలో టి.దర్శన్‌కు లిస్టనింగ్‌లో ఛాంపియన్‌, ఫ్లాష్‌లో మూడవ స్థానం దక్కించుకున్నాడు. గత నెల 18న జరిగిన రాష్ట్రస్థాయి యూసీమాస్‌ అబాకస్‌ ఆన్‌లైన్‌ విసువల్‌ కాంపిటేషన్‌లో టి.దర్శన్‌, బి.పవన్‌జయరామ్‌, ఎం.హర్షిత, జి.సౌర్యసాయిరెడ్డి ప్రతిభ చాటారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



వెంకటలక్ష్మి - నాగరాజు

తిరుమల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఉమెన్స్‌ కమిషన్‌ ఛైర్‌పర్సన్‌ వెంకటలక్ష్మి, కర్నూలు ఎంపీ నాగరాజు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి



పళనిస్వామికి స్వాగతం పలుకుతున్న ఓఎస్డీ

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్‌ ఓఎస్డీ సత్రే నాయక్‌ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. పళనిస్వామి మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

కార్మికశాఖ సర్కిల్‌ సహాయాధికారిగా ప్రవీణ్‌కుమార్‌



తిరుపతి(ఆటోనగర్‌)సెప్టెంబరు2: తిరుపతి సర్కిల్‌-1 కార్మిక సహాయ అధికారిగా ఎం. ప్రవీణ్‌ కుమార్‌ సోమవారం ఉప కార్మిక కమిషనర్‌ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఆయన కర్నూలు జోన్‌-4 కార్యాలయంలో సీనియర్‌ సహాయకుడిగా పనిచేశారు. తాజాగా ప్రమోషన్‌పై కార్మిక సహాయ అధికారిగా తిరుపతికి బదిలీ అయ్యారు. ఆయనకు అధికారులు,ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్‌కు వైసీపీ నేతల నివాళి



తిరుపతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి వర్ధంతి సందర్భంగా తుడా సర్కిల్లోని ఆయన విగ్రహం వద్ద సోమవారం వైసీపీ శ్రేణులు నివాళులర్పించాయి. మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్‌ డాక్టర్‌ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ డిప్యూటీ మేయర్‌ అభినయ్‌ తదితరులు పాల్గొన్నారు. భూమన మాట్లాడుతూ.. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలపై ఎలాంటి చిన్న చిన్న చర్యలు కూడా తీసుకోలేదన్నారు. సాయంత్రం ఎంపీ గురుమూర్తి ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్‌ హాలులో వైఎస్‌ వర్ధంతిని నిర్వహించారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆరణి సంధ్య, ఆదం రాధాకృష్ణా రెడ్డి, అజయ్‌కుమార్‌, మధునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరు, పీపీపురం, నూతిగుంట పల్లి, సూరావారిపల్లె గ్రామాల్లో మాజీ సీఎం వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం వైసీపీ నాయకులు నిర్వహించారు. వైఎస్‌ఆర్‌ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, గిరిరెడ్డి, యోగానందరెడ్డి, సిద్ధమరెడ్డి పాల్గొన్నారు.

రెస్కో మాజీ ఛైర్మన్‌ అరెస్టు



కుప్పం పోలీసు స్టేషన్‌ వద్ద సెంథిల్‌ కుమార్‌

కుప్పం, సెప్టెంబరు 2: కుప్పం రెస్కో మాజీ ఛైర్మన్‌ జీఎస్‌ సెంథిల్‌ కుమార్‌ను సోమవారం అర్బన్‌ పోలీసులు అరెస్టు చేశారు. రెస్కో ఎండీ సోమశేఖర్‌ ఫిర్యాదు మేరకు ఈ అరెస్టు జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో సెంథిల్‌ కుమార్‌ రెస్కో ఛైర్మన్‌గా కొనసాగారు. ఆ సమయంలో రెస్కో ఎండీకి కేటాయించిన వాహనాన్ని సొంతానికి వినియోగించుకున్నారు. సాధారణంగా ఈ వాహనానికి వేల రూపాయల అలవెన్సు మంజూరు అవుతుంది. ఈ అలవెన్సును తీసుకోవడమే కాకుండా అదనంగా డీజీలు బిల్లులు పెట్టి, సుమారు రూ.28 లక్షలు రెస్కోనుంచి డ్రా చేశారు. అంటే నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. వాహనం పేరుతో చేసిన నిధుల దుర్వినియోగంపై రెస్కో ప్రస్తుత ఎండీ సోమశేఖర్‌, గత నెల చివరి వారంలో కుప్పం అర్బన్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు నిందితుడైన రెస్కో మాజీ ఛైర్మన్‌ సెంథిల్‌పై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆయనకోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరిలో సెంథిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని సోమవారం కుప్పం తీసుకు వచ్చి అరెస్టు చేశారు. ఈయనపై 406, 409 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కోర్టు ముందు హాజరు పరచగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండు విధించారు. దీంతో సెంథిల్‌కుమార్‌ను మదనపల్లె సబ్‌ జైలుకు పోలీసులు తరలించారు. దీనిపై కుప్పం అర్బన్‌ సీఐ జీటీ నాయుడును వివరణ కోరగా రెస్కోలో వాహనం విషయంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదు మేరకు రెస్కో మాజీ ఛైర్మన్‌ సెంథిల్‌ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

తిరుపతి

సీమ విద్యా దాహాన్ని తీర్చిన ఎస్వీయూ

70వ వార్షికోత్సవంలో వీసీ, రిజిస్ట్రార్


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 2: రాయలసీమ ప్రాంత విద్యా దాహాన్ని తీర్చిన ఘన చరిత్ర వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఉందని ఆ వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ 70వ వార్షికోత్సవం సోమవారం శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు విభాగాలతో ఆరంభమై నేడు 70కి పైగా కోర్సులతో యూనివర్సిటీ అభివృద్ధి చెందిందన్నారు. నాడు స్థాపకుల కలల్ని నేడు యూనివర్సిటీ సాకారం చేసే దిశగా సాగుతోందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పటిష్ఠంగా అమలు చేస్తున్నామన్నారు. కాలానుగుణంగా డేటా సైన్స్ కోర్సును ప్రారంభించామన్నారు. త్వరలో నేషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. దీని ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. విద్యార్థుల స్కిల్ డేటాను డిజిటలైజేషన్ చేస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఉద్యోగులు క్రమశిక్షణతో, నిజాయితీతో పని చేయాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మందుబాబులపై ఈస్టు పోలీసుల కొరడా

అదుపులో 10 మంది


ఈస్టు పోలీసుల అదుపులో మందు బాబులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 2: తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందు బాబులపై ఈస్టు పోలీసులు సోమవారం కొరడా ఝులిపించారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో సీఐ మహేశ్వర్‌రెడ్డి టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని వెంట తీసుకుని బస్టాండు, రైల్వేస్టేషన్, కొర్లగుంట, మారుతి నగర్, తిలక్ రోడ్డు, శ్రీదేవి కాంప్లెక్స్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని భారతి బస్టాండు వద్ద బహిరంగ ప్రదేశంలో కొంత మంది పట్టపగలే మద్యం సేవిస్తున్నారు. మరోవైపు తిలక్‌రోడ్డులోని శ్రీదేవి కాంప్లెక్స్ ఎదురుగా మద్యం దుకాణం సమీపంలో బజ్జీ కొట్టు వద్ద రోడ్డు పక్కన కూర్చుని మద్యం సేవిస్తున్న వారిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. కొందరు మందుబాబులు మద్యం సేవించి రోడ్డుపై వెళుతున్నవారి పట్ల దురుసుగా ప్రవర్తించడం, దాడులకు దిగడం జరుగుతోంది. వీరితోపాటు అల్లరిమూకలు సైతం తిరుపతిలో రెచ్చిపోతున్నారు. ఇందులో భాగంగా ఈస్టు పోలీసులు సోమవారం 10 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మా భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారు

● బాధితుడు మావిళ్లయ్య ఆవేదన


కన్నీటి పర్యంతమవుతున్న మావిళ్లయ్య

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 2: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం రాయపేడు గ్రామ లెక్కల దాఖల సర్వే నఎంబరు 356, 164/15లో ఉన్న 48సెంట్ల తమ భూమిని అదే గ్రామానికి చెందిన ఏయిమలై, దొరస్వామి, మణిలు కబ్జా చేయాలని చూస్తున్నారని మావిలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూతప్పుడు పత్రాలు సృష్టించి తమ భూమిని కాజేయాలని చూస్తున్నారని వీరికి ఎమ్మెల్యే ఆదిమూలం అండదండలుఉన్నాయని ఆరోపించారు. తమకు సంబంధించిన అన్ని పత్రాలను పోలీసు అధికారులకు చూపించినా కూడా ఏ మాత్రం పట్టించుకోవడంలేదని భూకబ్జాదారులకే వత్తాసు పలుకుతున్నారన్నారు.గత20రోజుల క్రితం తమకుటుంబంపై మూకుమ్మడిగా దాడికిపాల్పడ్డారని కన్నీటిపర్యంతమయ్యారు. తాను ఇదేమండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయడుగా విధులు నిర్వహిస్తున్నానని 2019 ఎన్నికల్లో తమ కుటుంబం టీడీపీకి మద్ధతు పలికిందని అక్కసుతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తమపై కక్షకట్టి ఈ విధమైన చర్యలు పాల్పడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్‌కు కూడా విన్నవించామన్నారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి నారా లోకేష్ స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో లక్ష్మీకాంతం మునివేలు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

● బత్తలవల్లం గ్రామస్తుల వేడుకోలు



తిరుపతి(విద్య), సెప్టెంబరు 2: ప్రభుత్వం ఇచ్చిన భూమిని కొందరు కాజేయాలని చూస్తున్నారని వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం గ్రామానికి చెందిన ఎస్సీలు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిరుపేదలైన తమకు అప్పటి ప్రభుత్వం 1960లో ఓవలగుంట చేలల్లో 75 ఎకరాలను ఇచ్చిందన్నారు. అప్పటినుంచి తాము వ్యవసాయం చేసుకుంటున్నామన్నారు. ప్రభుత్వానికి శిస్తు కూడా కడుతున్నామన్నారు. కాలక్రమేణా కుటుంబాలు పెరగడంతో చుట్టుపక్కల ఖాళీగా ఉన్న మేత పోరంబోకు భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నామని చెప్పారు. 2008లో కల్కి గ్రామీణ అభివృద్ధి సంస్థకు అటవీ శాఖాధికారులు చుట్టుపక్కల భూములను ధారాదత్తం చేశారన్నారు. అటవీ శాఖాధికారులు ఈ భూమి స్వాధీనానికి ప్రయత్నించారన్నారు. ఇటీవల అటవీ శాఖాధికారులు అందులో మొక్కలు నాటారన్నారు. భూములు తమకు ఇప్పించి న్యాయం చేయాలని వీరు కలెక్టరును కలిసి కోరారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూముల్లోకూడా కల్కి ఆశ్రమం కొంత ఆక్రమించుకున్నారని వాపోయారు.


ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం తిరుపతిలో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న జనసేన నాయకుడు పూసా మాధవరావు

అదనపు ఎస్పీగా రవి మనోహరాచారి బాధ్యతల స్వీకరణ



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 2: జిల్లా శాంతిభద్రతల అదనపు ఎస్పీగా రవి మనోహరాచారి సోమవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని డీఎస్పీలు, సీఐలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

హెవీ లైసెన్స్‌దారులకు ఒకరోజు శిక్షణ

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 2: హెవీ లైసెన్స్ కోసం వచ్చే వాహనదారులందరూ అలిపిరి ఆర్టీసీ డిపోలోని శిక్షణ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ పొందాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఆదినారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్స్‌లో భాగంగా మెలకువలు నేర్పేందుకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు చెందిన వారు కూడా ఈ శిక్షణ పొందాలని సూచించారు. శిక్షణ అనంతరం హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఐసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఐసెట్ రెండో దశ కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 9 నుంచి 14వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఉందని పేర్కొంది. 17న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 17 నుంచి 21లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించింది.

హత్యకేసులో యావజ్జీవ కారాగార శిక్ష

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 2: తిరుపతి ఈస్ట్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 10వ అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు సోమవారం తీర్పు చెప్పారు. 2018సెప్టెంబరు 18న కడపజిల్లాకు చెందిన మాధవరెడ్డిని తిరుపతి భారతి బస్‌స్టాండ్ దారిలో రమేష్‌ధరణీధరన్, కుమార్ రాజ్‌కుమార్, దామోదరంలు హత్య చేశారు. మద్యం తాగడినికి అవసరమైన డబ్బులు కోసం వీరు మాధవరెడ్డిపై విచక్షణరహితంగా పాకెట్ కత్తులతో దాడిచేసి చంపారు. కోర్టులో కేసు నిరూపణ కావడంతో మొదటి ముద్దాయికి రమేష్.ధరణీధరన్‌కు శిక్ష పడింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12మందికి జరిమానా

తిరుపతి(లీగల్), సెప్టెంబరు2: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 12మంది నిందితులకు 10వేలు చొప్పున జరిమాన విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో నలుగురికి రెండురోజులపాటు జైలు విధించారు.

ఆయాలు, వాచ్‌మెన్ల జీతాలకు నిధులు విడుదల

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాలు, క్లీనింగ్ సామగ్రి కోసం నిధులు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. రూ.64.38 కోట్లు జీతాల కోసం, రూ.23.52 కోట్లు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐషర్ వాహనంలో మంటలు

తిరుపతి(నేరవిభాగం),సెప్టెంబర్2:తిరుపతి బ్లిస్ హోటల్ వద్ద ఆపివున్న ఐషర్ వాహనంలో సోమవారం రాత్రి అకస్మాత్తుగా ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. విషయం తెలిసిన అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. లేకుంటే పెద్ద ప్రమాదం జరిగేది. దీనిపై అగ్ని మాపక సిబ్బందిని అడుగ్గా... ఇంజిన్ ఆయిల్ వేడెక్కి ఉండడంతో మంటలు చెలరేగాయని, సిబ్బంది వెళ్లి మంటలు అదుపుచేసి రావడంతో ప్రమాదం తప్పిందని చెప్పారు. దాదాపు రూ.10 వేలు నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

తిరుపతి రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 2: తిరుపతి రూరల్ సీఐగా చిన్న గోవిందు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎస్ఐగా పని చేశారు. ఎన్నికల సమయంలో తిరుపతి వీఆర్‌కు పంపారు. ప్రస్తుతం తిరుపతి రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పల్లె ఎస్ఐలు నాగేంద్రబాబు, షేక్షావలి, ఏఎస్ఐలు, సిబ్బంది సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 219 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, కలెక్టర్‌తో మాట్లాడుతున్న విశ్రాంత ఆర్మీ అధికారులు

తిరుపతి(విద్య),సెప్టెంబరు2:కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు అర్జీదారులు భారీగా తరలి వచ్చారు. రెవెన్యూశాఖకు సంబంధించి146 అర్జీలు వచ్చాయి. పంచాయతీశాఖకు 22, పోలీసు శాఖకు సంబంధించి 13 అందాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో పెంచలకిషోర్, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, దేవేంద్రరెడ్డి, నరసింహులు ప్రజల నుంచి ఈ అర్జీలను స్వీరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు.

అధికారుల అండతో శ్మశానం ఆక్రమణ

గత ప్రభుత్వం హయాంలో ఓ ఆర్డీఓ అండతో కొంతమంది తమ గ్రామ శ్మశానాన్ని ఆక్రమించుకున్నారని తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీకి చెందిన మిట్టమీద కండ్రిగ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానంగా వాడుకుంటున్న 74 సెంట్ల స్థలాన్ని అప్పటి ఆర్డీఓ, మరికొందరు అధికారుల అండతో గ్రామానికి చెందిన ముగ్గురు పేర్లతో పట్టా భూమిగా రిజిస్టర్ చేసుకున్నారని గ్రామస్థుడు ఉమాపతి నాయుడు తెలిపారు. పనికి ఆహార పథకం కింద ఈ భూమికి రోడ్డుకూడా వేశారన్నారు. ప్రశ్నించిన వారిపై హత్యాయత్నం కేసులు పెట్టారన్నారు. కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

పోలీస్ క్యాంటీన్‌కు స్థలం కేటాయించండి

సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ (సీపీఎస్) నిర్మాణానికి స్థలం కేటాయించాలని బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ, అస్సాం రైఫిల్స్ విశ్రాంత సిబ్బంది కోరారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత ఎస్పీజీ ఎస్పీ పీసీ స్వామి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిశారు. తిరుపతిలో సీపీఎస్ ఏర్పాటుకు 25 సెంట్ల భూమిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులను చూపించారు. త్వరలో భూమిని గుర్తించి కేటాయిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

గడువులోగా తుడా టవర్స్ నిర్మాణం పూర్తి

వీసీ మౌర్య ఆదేశం

తిరుపతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాయల చెరువు రోడ్డులో తుడా టవర్స్ నిర్మాణ పనులను గడువులోపు పూర్తి చేయాలని తుడా వీసీ, నగరపాలక సంస్థ కమిషనర్ నారపరెడ్డి మౌర్య ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్, బాబు జగ్జీవన్ రామ్ పార్కు, శ్రీనివాసపురం పార్కు, సూరప్రకాశం తుడా లేఔట్, విమానాశ్రయం మార్గ సుందరీకరణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మౌర్య మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పనులను నిత్యం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జగజ్జీవన్ రామ్ పార్కులోని మరుగుదొడ్లలో నీటి వసతి కల్పించాలని, వాకింగ్ ట్రాక్ సక్రమంగా ఏర్పాటు చేయాలని వాకర్స్ ఆమెను కోరారు. మౌర్య స్పందిస్తూ వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తుడా సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, డీఈ బాషా, ఉద్యానవన శాఖాధికారి మాలతి, ఏఈ షణ్ముగం, ఏపీవో సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

● అర్జీలకు సంతృప్తికర పరిష్కారం

అర్జీదారులు సంతృప్తి పడేలా సమస్యలను పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 60 మంది వినతులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని, భూగర్భ డ్రైనేజీ మరమ్మతులు చేయించాలని కొందరు కోరినట్లు తెలిపారు. ఆక్రమణలు తొలగించాలని, అక్కడక్కడా ఉన్న చెత్త కుప్పలు తొలగించాలని కోరారన్నారు. పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏడీసీ చరణ్‌తేజరెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రాధిక, డీఈలు విజయకుమార్‌రెడ్డి, సంజయ్‌కుమార్, నరేంద్ర, మహేష్, రాజు, శ్రావణి, ఆర్వోలు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, డీసీపీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నగరపాలక సంస్థ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

మీ పంట.. ఈ-పంటలో నమోదైందా?

15వ తేదీ వరకే అవకాశం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 2: ఈ-పంటలో తమ పంటల వివరాలను ఖరీఫ్ రైతులు పెద్ద సంఖ్యలోనే నమోదు చేసుకున్నారు. మిగిలినవారు కూడా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో సాగవుతున్న పంటల విస్తీర్ణం 53,886 హెక్టార్లు. ఇందులో 44,204 హెక్టార్లు ఈ-పంటలో నమోదవడం విశేషం. విపత్తుల్లో తక్షణ సాయం అందించేందుకు, నష్టపరిహారాలకూ, పంటల బాగోగుల అంచనాకూ ఈ-పంట పేరుతో యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫాం(యూడీపీ)లో ప్రభుత్వం నమోదు చేయిస్తోంది. రాయితీలు, ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాల కోసం ఈ-పంటలో నమోదు చేసుకోవడం అవసరం. జిల్లా వ్యవసాయ అధికార యంత్రాంగం ఈ ప్రక్రియపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది.

నమోదు ఇలా చేసుకోవాలి..

● రైతులు తమ పంట వివరాలను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి నమోదు చేయించాల్సి ఉంటుంది.

● సాగు చేసిన పంట రకం, విస్తీర్ణం, సర్వే నెంబరు, పాసుపుస్తకం, ఆధార్, సెల్‌ఫోన్ నెంబర్ వివరాలు అందజేయాలి.

● దీంతో భూమి జియో ఫెన్సింగ్ అవుతుంది.

● ఆ తర్వాత రైతు సేవాకేంద్రాల సిబ్బంది పొలానికి వెళ్లి పంట ఫొటోలు తీసి ఈ-పంటలో నమోదు చేస్తారు. ● నమోదైనట్లు ధ్రువపత్రం రైతుల సెల్‌ఫోన్‌లకు వస్తుంది.

● జిల్లాలో మొత్తం రైతు కుటుంబాలు - 4,22,705.

● సాగవుతున్న మొత్తం భూమి - 74,573 హెక్టార్లు.

● ఖరీఫ్ సీజన్‌లో సాగయ్యే భూమి- 53,886 హెక్టార్లు.

● వ్యవసాయ పంటలు - 24,553 హెక్టార్లు.

● హార్టికల్చర్ 26,745.4 హెక్టార్లు, మల్బరీ 101.5, సోషల్ ఫారెస్ట్రీ 2,486 హెక్టార్లు.

● ఇప్పటి వరకు నమోదు చేసుకున్న విస్తీర్ణం - 47,930.7 హెక్టార్లు.

● 2024 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు నమోదు చేసుకున్న రైతులు - 44,204

● ఇంకా నమోదు కావాల్సిన విస్తీర్ణం - 5,955.3 హెక్టార్లు.

15లోగా నమోదు చేసుకోవాలి



సాగు చేస్తున్న ప్రతీ రైతూ ఈనెల 15లోగా ఈ-పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. 19 నుంచి 24వ తేదీ వరకు సామాజిక తనిఖీకోసం రైతు సేవా కేంద్రాల్లో రైతుల వివరాలను ప్రదర్శనకు ఉంచుతాం. 25 నుంచి 28వ తేదీ వరకు మార్పులు చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. 30వ తేదీ తుది జాబితా విడుదలవుతుంది.

- ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఎస్పీ కార్యాలయానికి 80 ఫిర్యాదులు


వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 2: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలమూలల నుంచి 80 ఫిర్యాదులు అందాయి. వీటిని ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, రవిమనోహరాచారి పాల్గొన్నారు.

రుయా ఏడీగా ధాత్రేశ్వరి దేవి



తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 2: రుయాస్పత్రి అసిస్టెంటు డైరెక్టర్(అడ్మిన్)గా యు.ధాత్రేశ్వరి దేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మదనపల్లి ప్రభుత్వాస్పత్రిలో ఏడీగా పనిచేస్తున్న ధాత్రేశ్వరి దేవిని రుయాస్పత్రి ఏడీగా నియమిస్తూ ఆగస్టు 30న డీఎంఈ ఆదేశాలు జారీ చేసినా అందుకు సంబంధించి రుయాస్పత్రికి ఎటువంటి నివేదికలు అందలేదు. అయినప్పటికీ ఆమె ఉదయమే ఏడీ ఛాంబర్‌లో కూర్చొని అనధికారికంగా బాధ్యతలు చేపట్టారు. సాయంత్రం వరకు డీఎంఈ నుంచి అధికారికంగా ఉత్తర్వులు రాకపోవడం ఉద్యోగులను గందరగోళానికి గురి చేసింది. అయితే సాయంత్రం 4 గంటల పైన డీఎంఈ నుంచి అధికారికంగా ఉత్తర్వులు రావడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 2: పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. అన్ని డివిజన్లలో మొక్కలు నాటారు. అన్నదానం, రక్తదానం కార్యక్రమాలు చేపట్టారు. కొన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పవన్‌కల్యాణ్ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. తొలుతగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసం వద్ద భారీ కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ ఆధ్వర్యంలో 12, 17, 3వ డివిజన్లలో మొక్కలు నాటి, అన్నదానం చేశారు. పంగులూరు సీతమ్మ మార్గంలో పార్టీ పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి నేతృత్వంలో దాదాపు 500 మొక్కలు నాటారు. అలాగే స్విమ్స్ ఆస్పత్రిలో దాదాపు 150మంది రక్తదానం చేశారు. జనసేన తిరుమల అధ్యక్షులు పగడాల మురళి, మాజీ సర్పంచ్ మమత ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రసూతి, రుయా ఆస్పత్రుల వద్ద సుమారు 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శీనురాయల్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి, అన్నదానం చేశారు. పొలకల మల్లికార్జున్ ఆధ్వర్యంలో గంగమ్మగుడి వద్ద, కూరగాయల మార్కెట్‌లో యువరాజ్‌రెడ్డి ఆధ్వర్యంలో, అలిపిరివద్ద నరసింహులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళల ఆటోలలో ఉచితంగా సీసీ కెమెరాలను అమర్చారు. పై కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే నిర్వాహకులను అభినందించి, పవన్‌కల్యాణ్‌పై అభిమానం ఇలానే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మబ్బు దేవనారాయణరెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, పి.హరిప్రసాద్, వెంకటేశ్వరరావు, సుభాషిణి, కీర్తన, వినోద్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో...

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఎస్వీయూనివర్సిటీ పరిపాలనా భవనం వద్ద అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా అనుపల్లెలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ మధును పరామర్శిస్తున్న జనసేన తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్

తిరుపతిలో బాడీ బిల్డర్స్ రాష్ట్రస్థాయి పోటీలు


శ్రీనివాసరాజుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 2: తిరుపతిలో వచ్చే సంవత్సరం జనవరిలో రాష్ట్రస్థాయి బాడీ బిల్డర్స్ పోటీలు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరాజు తెలిపారు. శ్రీవారిని దర్శించుకుని సోమవారం తిరుగు ప్రయాణమైన శ్రీనివాసరాజును తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పాండ్రువేటి గిరి మర్యాదపూర్వకంగా కలసి స్వామి వారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిలో బాడీబిల్డర్స్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలని కోరారు. అందుకు స్పందించిన శ్రీనివాసరాజు వచ్చే సంవత్సరం జనవరిలో రాష్ట్రస్థాయి లేక జోనల్‌స్థాయి పోటీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

భక్తి పేరుతో భూ కబ్జా: సీపీఎం



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కొండూరువాసులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 2: తడ మండలం కొండూరులో భక్తి ముసుగులో దొంగ బాబాలు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారంటూ సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ... కొండూరు పంచాయతీ సుందరపురం సర్వే నెం. 148లో రహదారి పక్కనే ఉన్న గుంట పొరంబోకును ఓ దొంగబాబ కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఆ బాబాకు గ్రామంలో కొందరు తెర వెనుక సహకరిస్తున్నారన్నారు. విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.లక్ష్మయ్య, రియాజ్, మునెయ్య, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దొరవారిసత్రం మండలంలోని శ్రీధనమల్లి పంచాయతీ కుమ్మరకండ్రిగ గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. గిరిజన కాలనీకి, శ్మశానికి రోడ్డు వసతి కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తమ కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గూడూరు, సెప్టెంబరు 2: ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజావేదికలో అందించే అర్జీలను స్వయంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులకు పరిష్కరించాలని సూచిస్తున్నామన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కండి

దొరవారిసత్రం, సెప్టెంబరు 2: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం దొరవారి సత్రం బీసీ గురుకుల కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైం, ర్యాగింగ్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. కొందరు స్వార్థపరులు అక్రమంగా సంపాదించడానికి గ్రామాల్లో డ్రగ్స్ విక్రయాస్తున్నారన్నారు. విద్యార్థుల డ్రగ్స్ విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చెడు వ్యసనాలకు ఆలోచనలు రానీయకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇటువంటి గురుకుల పాఠశాలలో చదివి దొరవారిసత్రం ఎస్‌ఐగా పనిచేస్తున్న అజయ్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

6న ఖాళీ టిన్నుల విక్రయానికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుమల, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్నుల విక్రయానికి టీటీడీ సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన వారు టీటీడీ వినియోగించిన ఖాళీ టిన్నులను సేకరించవచ్చు. తిరుపతిలోని హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్ వేలం కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయాల్సిఉంటుంది. ఇతర వివరాలకు 0877 2264429 నెంబరును సంప్రదించాలని టీటీడీ సూచించింది.

సీమ విద్యా దాహాన్ని తీర్చిన ఎస్వీయూ

70వ వార్షికోత్సవంలో ఇన్‌చార్జి వీసీ అప్పారావు



జ్యోతి ప్రజ్వలనలో వీసీ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 2: రాయలసీమ ప్రాంత విద్యా దాహాన్ని తీర్చిన ఘన చరిత్ర వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఉందని ఆ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ 70వ వార్షికోత్సవం సోమవారం శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు విభాగాలతో ఆరంభమై నేడు 70కి పైగా కోర్సులతో యూనివర్సిటీ అభివృద్ధి చెందిందన్నారు. నాడు స్థాపకుల కలల్ని నేడు యూనివర్సిటీ సాకారం చేసే దిశగా సాగుతోందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పటిష్ఠంగా అమలు చేస్తున్నామన్నారు. కాలానుగుణంగా డేటా సైన్స్ కోర్సును ప్రారంభించామన్నారు. త్వరలో నేషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. దీని ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. విద్యార్థుల స్కిల్ డేటాను డిజిటలైజేషన్ చేస్తున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పాలనలో వేగం తీసుకొస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఫీజు చెల్లింపునకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. రిటైర్డు ఉద్యోగుల కోసం వెబ్‌సైట్ ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఉద్యోగుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగులు క్రమశిక్షణతో, నిజాయితీతో పని చేయాలని కోరారు.

ఐసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఐసెట్ రెండో దశ కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 9 నుంచి 14వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఉందని పేర్కొంది. 17న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 17 నుంచి 21లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించింది.

ఆయాలు, నైట్ వాచ్‌మెన్ల జీతాలకు నిధులు విడుదల

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాలు, క్లీనింగ్ సామగ్రి కోసం నిధులు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. రూ.64.38 కోట్లు జీతాల కోసం, రూ.23.52 కోట్లు సామగ్రి కోసం విడుదల

అదనపు ఎస్పీగా రవి మనోహరాచారి బాధ్యతల స్వీకరణ



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 2: జిల్లా శాంతిభద్రతల అదనపు ఎస్పీగా రవి మనోహరాచారి సోమవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని డీఎస్పీలు, సీఐలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో శాంతి భద్రతల విషయంలో గట్టిగా పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు

- ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు





ఎన్‌జేఆర్ సర్కిల్ వద్ద కింద పడిపోయిన ఫ్లెక్సీ - ఆర్ అండ్ బీ అతిథిగృహం వద్దఆ ప్రమాదకరంగా ఫ్లెక్సీ ఫ్రేం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 2: ప్లాస్టిక్, ఫ్లెక్సీల నిర్మూలనకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం విఫలమవుతూనే ఉంది. రోజురోజుకు అవి రెండింతలుగా పెరిగి పర్యావరణం దెబ్బతినే స్థాయికి చేరుతోంది. అరికట్టాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కాశీపేట, పాతబస్టాండ్, రాపూరు క్రాస్, క్రాస్ రోడ్డు, కైవల్యానది నుంచి రైల్వేస్టేషన్ డివైడర్ మధ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటి వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.ఈదురు గాలులతో ఫ్లెక్సీలు చిరిగి నేలకొరిగాయి. ఆర్ అండ్ బీ అతిథి గృహం డివైడర్ వద్ద ఉన్న ఫ్లెక్సీ నేలకొరగడంతో వాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి. పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని తెలుస్తోంది. అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలకు జరిమానా విధించవచ్చు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని గతంలో కౌన్సిలర్ ఆరి శంకరయ్య సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకుని అనధికార ఫ్లెక్సీల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అసలే ఇరుకు... రోజూ చిరాకు!



రాజా వీధిలో ట్రాఫిక్ జాం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 2: పెరిగిన వాహనాలు, జనాభాకు అనుగుణంగా పట్టణం రహదారుల్ని విస్తరించాల్సి ఉంది. పట్టణంలో ఆక్రమణలతో రహదారులు కుచించుకుపోయాయి. దీంతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. ఇరుకైన రోడ్లలోనే వాహనాలు నిలపుతున్నారు. పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ఎదురుగా వాహనాలు కానరాకుండా కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా రాజావీధి, పోలేరమ్మ ఆర్చి సెంటర్, పాత బస్టాండ్, తూర్పువీధి, కాశీపేట, దక్షిణపు వీధులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాకర్షణ కలిగిన నాయకుడు పవన్: ఎమ్మెల్యే విజయశ్రీ







తడ పట్టణంలోని కేజీబీవీలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ - సూళ్లూరుపేటలో కేక్ కటింగ్ - గూడూరులో మొక్కనాటుతున్న జనసైనికులు

తడ, సెప్టెంబరు 2: రాష్ట్రంలో ప్రజాకర్షణ నాయకుడిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యే విజయశ్రీ కొనియాడారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్ పుట్టిన రోజు సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని కేక్ కట్ చేసి పంచిపెట్టి మొక్కలు నాటారు. స్థానిక బస్టాండ్ కూడలిలో అన్నదానం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, రమేష్, శ్రీధర్‌తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకలను బాలాయపల్లిలో జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. గూడూరు ఏరియా ఆస్పత్రి సహకారంతో బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు

గూడూరు: డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకలను సోమవారం గూడూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పీఎస్ఆర్ పార్కులో జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మోహన్, నాగార్జున, సాయి, వెంకటేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని లింగవరం, గుమ్మళ్లదిబ్బల్లో జనసేన నాయకులు కార్తీక్, మహేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పుట్టినరోజును పురస్కరించుకుని జెండాలను ఆవిష్కరించారు.

సూళ్లూరుపేట: జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండు వద్ద టీడీపీ జిల్లా కార్యదర్శి వి.సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అ నంతరం అన్నదానం చేశారు. జనసేన నాయకులు మాబాషా, గిరిబాబు రమణ, దాస్, కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు నాపా మునిరాజా, రమేష్ రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని జువ్వలపాళెం క్రాస్‌రోడ్డులో డిప్యూటీ సీఎం పవన్ జన్మదినం సందర్భంగా జనసేన నాయకులు అట్ల కృష్ణారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విజయశ్రీ హాజరయ్యారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని శ్రీలక్ష్మమ్మకాలనీలో సోమవారం ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు ఘనంగా జరుపుకున్నారు.అల్లంబాబు, మునిగిరీష్, డాక్టర్ తిరుమలశెట్టి కోటేశ్వర రావు, ఎం.మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: పట్టణంలో ఎన్ఆర్ఐ ఏ.బాలసుబ్రహ్మణ్యం, బి.సుబ్రహ్మణ్యం రెడ్డి, శివకుమార్ ఆధ్వర్యంలో, కల్లూరులో డి.జనార్దన రెడ్డి ఆధ్వ ర్యంలో, వాకాడులో ఆర్.శివకోటి ఆధ్వర్యంలో ఆలయాల్లో పూజలు, కేక్ కటింగ్, అన్నదానాలు జరిగాయి. ఎస్.విజయశేఖర్‌రెడ్డి, కె.నందగోపాల్ రెడ్డి, పి.పురుషోత్తమరెడ్డి, బి.ప్రమీల, కుంచం దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ ప్రజాసంక్షేమ పథకాలు చిరస్మరణీయం





కిలివేటి ఆధ్వర్యంలో అన్నదానం - గూడూరులో నివాళులర్పిస్తున్న మేరిగ మురళీధర్ దితరులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 2: ప్రజారంజకమైన సంక్షేమ పథ కాలను అమలు చేసిన ఘనత దివంగత సీఎం వైఎస్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట ఆర్టీసీ కూడలిలో సోమవారం వైఎస్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో కలసి అన్నదానం చేశారు. కె.దీపిక, దనలక్ష్మి, టి.సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: దివంగత సీఎం వైఎస్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ నగర్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, యామిని, బి.విజయ్‌కుమార్,సుబ్బారావు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: దివంగత సీఎం వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆయనకు సూళ్లూరుపేట వైసీపీ పార్టీ కార్యాలయంలో ఎంపీపీ ఎ.అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ చిన్ని సత్యనారాయణ, నాయకులు వేణుయాదవ్, శ్రీధర్, యుగంధర్, వి.బాబురెడ్డి, ఏ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్:దివంతగత సీఎం వైఎస్ వర్ధంతి సందర్భంగా కౌన్సిలర్ డిల్లీబాబు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్ వంటి పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచి పోయాయన్నారు. ఆరి శంకరయ్య, నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానికంగా ఉన్న వైఎస్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కిశోర్ రెడ్డి, రాజారెడ్డి, గోపాల్ యాదవ్, మల్లెల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తడ: మండలంలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న వైఎస్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఆర్ముగం, వెంకటకృష్ణారెడ్డి, సుందరరెడ్డి, కోదండం, హుస్సేన్, తిరుమలరెడ్డి, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోట: మండలంలోని కర్లపూడిలో సర్పంచ్ సన్నారెడ్డి చెంచురాఘవ రెడ్డి, పి.సురేంద్ర ఆధ్వర్యంలో, గూడలిలో వి.షనీల్‌రెడ్డి, పి.విజయసారథి రెడ్డి, వరదారెడ్డి ఆధ్వర్యంలో, కోట క్రాస్‌రోడ్డులో వైసీపీ మండల కన్వీనర్ పి.సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహాలకు నివాళి అర్పించారు.

మీ పంట.. ఈ-క్రాప్‌లో నమోదైందా?

- 15వ తేదీ వరకే అవకాశం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 2: ఈ-పంటలో తమ పంటల వివరాలను ఖరీఫ్ రైతులు పెద్ద సంఖ్యలోనే నమోదు చేసుకున్నారు. మిగిలిన వారు కూడా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో సాగవుతున్న పంటల విస్తీర్ణం 53,886 హెక్టార్లు. ఇందులో 44,204 హెక్టార్లు ఈ-పంటలో నమోదవడం విశేషం. విపత్తుల్లో తక్షణ సాయం అందించేందుకు, నష్టపరిహారాలకూ, పంటల బాగోగుల అంచనాకూ ఈ-పంట పేరుతో యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫాం(యూడీపీ)లో ప్రభుత్వం నమోదు చేయిస్తోంది. రాయితీలు, ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాల కోసం ఈ-పంటలో నమోదు చేసుకోవడం అవసరం. జిల్లా వ్యవసాయ అధికార యంత్రాంగం ఈ ప్రక్రియపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది.

నమోదు ఇలా...

- రైతులు తమ పంట వివరాలను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి నమోదు చేయించాల్సి ఉంటుంది.
- సాగు చేసిన పంట రకం, విస్తీర్ణం, సర్వే నెంబరు, పాసుపుస్తకం, ఆధార్, సెల్‌ఫోన్ నెంబర్ వివరాలు అందజేయాలి.
- దీంతో భూమి జియో ఫెన్సింగ్ అవుతుంది.
- ఆ తర్వాత రైతు సేవాకేంద్రాల సిబ్బంది పొలానికి వెళ్లి పంట ఫొటోలు తీసి ఈ-పంటలో నమోదు చేస్తారు.
- నమోదైనట్లు ధ్రువపత్రం రైతుల సెల్‌ఫోన్‌లకు వస్తుంది.
- జిల్లాలో మొత్తం రైతు కుటుంబాలు - 4,22,705.
- సాగవుతున్న మొత్తం భూమి - 74,573 హెక్టార్లు.
- ఖరీఫ్ సీజన్‌లో సాగయ్యే భూమి- 53,886 హెక్టార్లు.
- వ్యవసాయ పంటలు - 24,553 హెక్టార్లు.
- హార్టికల్చర్ 26,745.4 హెక్టార్లు, మల్బరీ 101.5, సోషల్ ఫారెస్ట్రీ 2,486 హెక్టార్లు.
- ఇప్పటి వరకు నమోదు చేసుకున్న విస్తీర్ణం - 47,930.7 హెక్టార్లు.
- 2024 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు నమోదు చేసుకున్న రైతులు - 44,204
- ఇంకా నమోదు కావాల్సిన విస్తీర్ణం - 5,955.3 హెక్టార్లు.

15లోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

సాగు చేస్తున్న ప్రతీ రైతూ ఈనెల 15లోగా ఈ-పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. 19 నుంచి 24వ తేదీ వరకు సామాజిక తనిఖీకోసం రైతు సేవా కేంద్రాల్లో రైతుల నమోదు వివరాలను ప్రదర్శనకు ఉంచుతాం. 25 నుంచి 28వ తేదీ వరకు మార్పులు చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. 30వ తేదీ తుది జాబితా విడుదలవుతుంది.

- ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాధికారి

మా భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారు

బాధితుడు మావిళ్లయ్య ఆవేదన

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 2: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం రాయపేడు గ్రామ లెక్కల దాఖల సర్వే న ఎంబరు 356, 164/15లో ఉన్న 48సెంట్ల తమ భూమిని అదే గ్రామానికి చెందిన ఏయిమలై, దొరస్వామి, మణిలు కబ్జా చేయాలని చూస్తున్నారని మావిలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూతప్పుడు పత్రాలు సృష్టించి తమ భూమిని కాజేయాలని చూస్తున్నారని వీరికి ఎమ్మెల్యే ఆదిమూలం అండదండలుఉన్నాయని ఆరోపించారు. తమకు సంబంధించిన అన్ని పత్రాలను పోలీసు అధికారులకు చూపించినా కూడా ఏ మాత్రం పట్టించుకోవడంలేదని భూకబ్జాదారులకే వత్తాసు పలుకుతున్నారన్నారు.గత20రోజుల క్రితం తమకుటుంబంపై మూకుమ్మడిగా దాడికిపాల్పడ్డారని కన్నీటిపర్యంతమయ్యారు. తాను ఇదేమండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయడుగా విధులు నిర్వహిస్తున్నానని 2019 ఎన్నికల్లో తమ కుటుంబం టీడీపీకి మద్దతు పలికిందని అక్కసుతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తమపై కక్షకట్టి ఈ విధమైన చర్యలు పాల్పడుతున్నారని ఆరోపించార. కలెక్టర్‌కుకూడా విన్నవించామన్నారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం మంత్రి నారా లోకేష్స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో లక్ష్మీకాంతం మునివేలుపాల్గొన్నారు.

పట్టుబడిన సముద్ర వానపాములు

- అటవీశాఖ అధికారులకు అప్పగింత





ఫారెస్టు అధికారులకు వానపాములను అప్పగిస్తున్న ఎస్ఐ

ఉలవపాడు, సెప్టెంబరు 2: రొయ్యల ఉత్పత్తి కేంద్రాల్లో ఉపయోగించే వానపాములు, సముద్ర ఎర్రలు(బ్లడ్ వామ్స్)ను అక్రమంగా తరలిస్తుండగా సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అంకమ్మ కథనం మేరకు సూళ్లూరుపేట నుంచి ఒంగోలుకు 30 కిలోల వానపాములను కారులో తరలిస్తుండగా ఉలవపాడు జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తుండగా పట్టుపడినట్లు ఆయన తెలిపారు. వీటిని రొయ్యల హేచరీస్‌లో ఫీడింగ్ కోసం వాడతారని, పట్టుబడిన వాటి విలువ సుమారు రూ.50,000 ఉంటుందని తెలిపారు. వీటిని సూళ్లూరుపేట ఫారెస్టు డివిజన్ రేంజర్ టి.నరసింహారావుకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

మహా నవావరణ హోమపూజలు



గూడూరు అర్బన్, సెప్టెంబరు 2: స్థానిక సీఆర్‌రెడ్డి కల్యాణమండపంలో సోమవారం సాయి సత్సంగ నిలయం ఆధ్వర్యంలో 700వ మహా నవావరణ హోమపూజలను వేదపండింతుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ లోకశాంతి కోసం అనేక ప్రాంతాల్లో మహా నవావరణ హోమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే 699 నవావరణ హోమాలను పూర్తి చేశామన్నారు. సోమవారం 700వ హోమాన్ని నిర్వహించామన్నారు. ప్రకాశం, గిరీష్‌రెడ్డి, సాయిమహేష్, చంద్రశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 2: మండలంలోని సంతదాసుపల్లిలో సోమవారం గ్రామానికి చెందిన దివ్యాంగుడికి రాజనేని రామనాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను అందజేశారు. అమరయ్యనాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఐలను కలిసిన బీజేపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 2: గూడూరు రెండో పట్టణ సీఐగా శ్రీనివాసరావు, రూరల్ సీఐగా కిషోర్‌బాబు ఇటీవల బాధ్యతలు చేపట్టడంతో సోమవారం పట్టణ బీజేపీ నాయకులు వారిని మార్యదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, దయాకర్, శ్రీనివాస్, సురేష్‌బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 2: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పి.దేవసేనమ్మ పుట్టినరోజు సందర్భంగా రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు షంషీర్, ముని, సాయి, కబీర్, ఇమ్రాన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కాదు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఏర్పేడు, సెప్టెంబరు 2: జియో పరిశ్రమ కోసం భూములిచ్చిన వారికి పరిహారం కాకుండా ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఏర్పేడు మండల వికృతమాల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జియో పరిశ్రమ కోసం భూసేకరణ చేసిందన్నారు. కానీ పరిహారం విషయంలో రైతులకు అన్యాయం చేశారని వాపోయారు. తాము కోర్టును ఆశ్రయించగా పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని 2023లో ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. కరీముల్లా, వెంకటముని, రమేష్, చలపతి, మురగప్పన్ తదితరుల పాల్గొన్నారు.

బాలయ్య, పవన్ బాటలో నడుద్దాం



మొక్కను నాటుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: సినిమా రంగంతో పాటు సామాజిక సేవల్లో భాగస్వాములు అవుతున్న నందమూరి బాలకృష్ణ, పవన్ కల్యాణ్ అడుగుజాడల్లో నడుద్దామని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. బాలకృష్ణ నటజీవితం 50 ఏళ్లు పూర్తయిన, పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా తొట్టంబేడు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మిన్నల రవి, ఉమేష్‌రావు, బుజ్జి, కోట చంద్రశేఖర్, భాస్కర్, మణి, వెంకటేశ్వర్లు, సునీత్, హేమభూషణ్, షేక్ జిలానీ, గణేష్, శివ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.06 కోట్లు

తిరుమల, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.06 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను లెక్కించగా టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 74,498 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 25,355 మంది తలనీలాలు సమర్పించారు.

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిద్దాం: ఆర్డీవో


ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలను నిర్వహించేందుకు అందరూ సహకరించాలని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ కోసం ఆయా కమిటీల నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఈ యేడాది సింగిల్ విండో విధానం ద్వారా ఒకే ఆన్‌లైన్ దరఖాస్తుతో అన్ని శాఖల అనుమతి ఏక కాలంలో లభించేలా విధి విధానాలను రూపొందించామన్నారు. వినాయక మండప కమిటీ నిర్వాహకులు 7995095800 అనే వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అనే సందేశం పంపడం ద్వారా, గణేష్ ఉత్సవ్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అన్నిశాఖల అనుమతులు ఏకకాలంలో పొందిన కమిటీల నిర్వాహకులు ఆయా మండపాల వద్ద ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా చూడాలన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

పిచ్చాటూరు, సెప్టెంబరు 2: వినాయక చవితి ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతి పొందాలని ఎస్ఐ వెంకటేష్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా చవితి ఉత్సవాల నిర్వాహకులు సులభంగా అనుమతులు పొందవచ్చన్నారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే వారు హెచ్‌టీటీపీ//డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు జీఈఎన్‌ఈఎస్‌హెచ్‌యూటీఎస్‌ఈవీ నెట్ ఈ లింకు ద్వారా వివరాలు నమోదు చేసుకుని అనుమతి పొందవచ్చన్నారు. వెబ్‌సైట్‌లో నమోదు చేయడం తెలియని వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించవచ్చన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 14న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాడానికి పోలీసుశాఖ కృషి చేయాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. సోమవారం న్యాయస్థాన భవనంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీరాణి, కృష్ణప్రియ, డీఎస్పీ నరసింహమూర్తి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బీఎన్‌కండ్రిగ మండలాల పోలీసులు పాల్గొన్నారు.

ఆదిమూలంపై ఆరోపణలు సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ నాయుడు

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 2: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని టీడీపీ సత్యవేడు నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడుతో కలసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిరోజు జిల్లా అధికారులతో చర్చిస్తున్నారని, అదే విధంగా నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే టీడీపీ నాయకులతో అందుబాటులో ఉంటున్నారని, వైసీపీ నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు చేయడం సమంజం కాదన్నారు. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన, టీడీపీ శ్రేణులను ఇబ్బందులుకు గురి చేసిన వైసీపీ నాయకులను వదిలే ప్రస్తకి లేదన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు భాషా పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 2: మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు ఆంబాకం చిన్నిరాజు మాట్లాడుతూ కార్మికులకు 20 నెలల బకాయి ఉన్న జీతాలు ఇవ్వాలని ఇవ్వాలని కోరారు. అలాగే పంచాయతీల్లో చెత్త సేకరించే బండ్లు మరమ్మతులకు గురైనా బాగు చేయడం లేదని, కార్మికులకు గ్లౌసులు, బూట్లు, యూనిఫాం ఇవ్వడం లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేలకు జీతాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప.ఏయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అన్నాదొరై, ఏఐటీయూసీ నాయకులు సుభాష్, మునిచంద్ర, ఆనంద్, ఆటో యూనియన్ నాయకుడు హరి, కార్మికులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


నందమూరి రామకృష్ణకు ముక్కంటి జ్ఞాపిక అందజేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మాజీ సీఎం నందమూరి రామారావు తనయుడు నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు. ఆయనకు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్ నాయుడు, చెంచయ్యనాయుడు, మునిరాజా యాదవ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు. అలాగే శత్రుపురం, మన్యం రాజు, క్యాప్ సినిమాల దర్శకుడు సోమసుందరం, కొరియోగ్రాఫర్ పవన్ విక్కీ, నటుడు కృష్ణ చైతన్య తదితరులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైభవంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్టించి పురవిహారం చేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం: ఇద్దరి అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 2: మండలంలోని చల్లమాంబపురం బస్టాండు దగ్గర 20 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

చక్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మగుడివీదిలో వెలసిన చక్రేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారికి అర్చకులు పలురకాల అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

సుందరీకరణ పనుల పరిశీలన


మొక్కలను పరిశీలిస్తున్న తుడా ఉపాధ్యక్షురాలు మౌర్య

రేణిగుంట, సెప్టెంబరు 2: విమానాశ్రయం వద్ద తుడా ఆధ్వర్యంలో చేపట్టిన సుందరీకరణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్, తుడా ఉపాధ్యక్షురాలు మౌర్య సోమవారం ఉదయం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విమానాశ్రయం వెళ్లే దారిలోని డివైడర్ల మధ్యలో వివిధ రకాల రంగులు కలిగిన పూల మొక్కలను నాటి మరింత సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ, తుడా అధికారులు పాల్గొన్నారు.

మా భూమి లాక్కోవద్దు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 2: తాము సాగుచేసుకుంటున్న భూములను లాక్కోవద్దని వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం దళితులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఓవలగుంట చేలులో ఉన్న 147 ఎకరాల్లో 1960 నుంచి తాము వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. అటవీశాఖ అధికారులు ఇటీవల ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు తాము సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నదానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాలమ్మ ఆలయం వద్ద సోమవారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, కాంత్రి కుమార్, శివకుమార్‌రెడ్డి, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, రాజేశ్వరరావు, వినోద్ కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 2: మండలంలోని కదూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సీడీపీవో దేవకుమారి, సూపర్‌వైజర్ యమున, హెల్త్ సూపర్ వైజరు జయలక్ష్మి, ఏఎన్ఎంలు మాలతి పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇప్పించండి

కేవీబీపురం, సెప్టెంబరు 2: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన దళితులు ఇంటి స్థలాలు ఇప్పించాలని సోమవారం తహసీల్దారు దస్తగిరయ్యకు వినతిపత్రం అందించారు. తమకు ఇళ్లు లేక ఒక్కో ఇంట్లో రెండు మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు.

పుత్తూరు వార్తలు

ఎస్ఐకి సన్మానం


ఎస్ఐను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 2: పుత్తూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఓబయ్యను సోమవారం టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ధనపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, వైస్ చైర్మన్ ఆనంద్, కౌన్సిలర్ కేశవాచారి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, బాబు నాయుడు, కేశవ, మాధవ, భరత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలను అరికట్టాలి

పుత్తూరు, సెప్టెంబరు 2: పట్టణంలోని కళాశాలల వద్ద జరుగుతున్న గంజాయి విక్రయాలను అరికట్టాలని ఎస్ఐ ఓబయ్యను సీపీఐ నాయకులు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐను సీపీఐ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి, సన్మానించారు. మహేష్ మాట్లడుతూ పట్టణంలోని ఆర్డీఎం సర్కిల్, బైపాస్ రోడ్డు, కల్యాణపురం సర్కిల్, బాలికల కళాశాలల వద్ద సాయంత్రం పూట పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు.

నిర్లక్ష్యపు నీడలో డయాలసిస్ కేంద్రం

ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని రోగుల ఆవేదన ● నీటి కొరతతో నాలుగు గంటల పాటు స్తంభించిన వైద్యసేవలు


డయాలసిస్ కేంద్రం వద్ద నీటిని దింపుతున్న ఆటో

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: శ్రీకాళహస్తిలోని ఉచిత డయాలసిస్ కేంద్రం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్లాడుతోంది. తరచూ విద్యుత్ అంతరాయం, నీటి కొరత పేరుతో కిడ్నీ బాధితుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని రోగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. 2016లో అప్పటి మంత్రిబొజ్జల గోపాలకృష్ణారెడ్డి చొరవతో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఉచిత డయాసిస్ కేంద్రం ఏర్పాటు అయింది. గత వైసీపీ పాలనలో డయాలసిస్ కేంద్రం నిర్వహణపై అశ్రద్ధ అలుముకుంది. డయాలసిస్ కేంద్రానికి సరిపడా విద్యుత్, నీటి సరఫరా గురించి పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. మూడేళ్ల నుంచి తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడం... సరఫరా నిలిచిపోవడం జరుగుతోంది. విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రతిసారి నీటి సరఫరాలో ఇబ్బందులు తప్పడంలేదు. ఒక్కో బాధితుడికి 4గంటల పాటు యంత్రాల ద్వారా రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియ డయాలసిస్ ద్వారా జరగాలి. ఇందుకోసం విద్యుత్, నీటి సరఫరా తప్పనిసరి. ఇదంతా తెలిసినా డయాలసిస్ కేంద్రంలోని అధికారులు నిమ్మకు నీరేత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా సోమవారం డయాలసిస్ కేంద్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో ఉన్న నీటితోనే నాలుగుగంటలకు బదులుగా రెండేసి గంటల చొప్పున డయాలసిస్ చేసి చేతులు దులుపుకున్నారని రోగులు ఆరోపించారు. ఇక మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కావాల్సిన మూడవ షిఫ్టునకు డయాలసిస్ కేంద్రంలో చుక్కనీరు అందుబాటులో లేకుండాపోయింది. దీంతో కొన్ని గంటల పాటు డయాలసిస్ సేవలు స్తంభించిపోయాయి. దూరప్రాంతాల నుంచి డయాలసిస్ కోసం వచ్చిన రోగులకు అయోమయ పరిస్థితి ఎదురైంది. కొందరు రోగులు అధికారులను నిలదీయడంతో సాయంత్రం 6గంటల సమయంలో ప్రైవేటు ఆటో ద్వారా నీటిని సమకూర్చుకుని ఆలస్యంగా డయాలసిస్ చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే పగబట్టి వేధిస్తున్నారని ఓ రోగి వాపోతున్నారు. తాను మూడేళ్లుగా డయాలసిస్ వైద్యసేవలు పొందుతున్నానని, తరచూ విద్యుత్, నీటి సరఫరా లేదని పలుమార్లు డయాలసిస్ చేయకుండానే ఇంటికి తిప్పి పంపేశారని ఓ రోగి ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్ సేవలు చిరస్మరణీయం



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధు, రెడ్డీస్ అసోసియేషన్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్ వర్థంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వైసీపీ నాయకులు హేమభూషణరెడ్డి, వాసుదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం అమావాసక్య కావడంతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 27వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1.101 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,081 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,725 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,206, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 402మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 270మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 864 మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 19,980 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 2: మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ అన్నారు. వరదయ్యపాళెంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అవాంఛనీయ ఘటనలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తరుణ్‌కుమార్, కృష్ణమూర్తి, వెంకటేష్, నాగార్జున, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు దుస్తులు అందజేత

ఏర్పేడు, సెప్టెంబరు 2: ఏర్పేడు మండలం చిందేపల్లి గిరిజనకాలనీలో పేద విద్యార్థులకు యువనేస్తం ఆధ్వర్యంలో దుస్తులు అందించారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు మునిశేఖర్, సభ్యుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పదిరోజుల్లో రికార్డులు అందజేయండి

రేణిగుంట, సెప్టెంబరు 2: కరకంబాడి పంచాయతీలో ఖర్చు చేసిన రూ.2.కోట్లు నిధులకు సంబంధించి రికార్డులను పదిరోజుల్లో ప్రస్తుత కార్యదర్శికి అందజేయాలని పూర్వ కార్యదర్శి రామాంజనేయులురెడ్డిని డీఎల్‌పీవో ప్రభురెడ్డి ఆదేశించారు. సోమవారం కరకంబాడి పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. గతంలో ఇంటి పనులకు తమ వద్ద లంచం తీసుకున్నారని బాధితులు డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై రామాంజనేయులురెడ్డి ఈవిషయంపై మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సీపీఎం నాయకులు తెలిపారు.

వెంకటాపురం చెరువును కాపాడండి

రేణిగుంట, సెప్టెంబరు 2: వెంకటాపురం చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని అన్నాసామిపల్లె రైతు సంఘం అధ్యక్షుడు వెంకటాద్రి యాదవ్ సోమవారం కలెక్టర్‌కు వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. రేణిగుంట మండల పరిధిలోని వెంకటాపురం చెరువు దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. అయితే కొంతమంది చెరువును ఆక్రమించడంతో కబ్జాకు గురైందన్నారు. చెరువును రీసర్వే చేసి ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని కాపాడాలని కోరారు.

అప్పలాయిగుంటలో శ్రీవారి లడ్డూల విక్రయం



వడమాలపేట, సెప్టెంబరు 2: అప్పలాయిగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం తిరుమల శ్రీవారి లడ్డూల విక్రయాన్ని సోమవారం ప్రారంభించినట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఒక్కో లడ్డు రూ.50 చొప్పున ఒక్కొక్కరికి ఐదు లడ్డూల చొప్పున విక్రయి స్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 500 లడ్డూలను అందుబాటులో వుంచామన్నారు. ప్రత్యేక పర్వదినాల్లో, శనివారం నాడు ఎక్కువ సంఖ్యలో లడ్డూలను విక్రయించాలని ఈవో నిర్ణయించినట్లు తెలిపారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

వడమాలపేట, సెప్టెంబరు 2: సంఘమిత్రలు, వీఎల్‌వోలకు గత ఆరు మాసాలుగా పెండింగ్‌లో వున్న జీతాలను తక్షణం చెల్లించాలని సీఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడమాలపేట మండలంలో సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా వీఎల్‌వోలు, సంఘమిత్రల సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ వీఎల్‌వోలు, సంఘమిత్రలు ఆరు నెలలుగా జీతాలు అందక నానా తిప్పలు పడుతున్నారన్నారు. కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, వీఎల్‌వోలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. సంఘమిత్ర హేమలత అనారోగ్యంతో చనిపోవడంతో ఆమెకు రివాల్వింగ్ ఫండ్ ద్వారా రూ.50వేల చెక్కును వారి కుటుంబీకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, నాగరాజ్, శ్రీధర్, రమేష్, శ్రీదేవి, అరుణ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రప్పనాయుడు కండ్రిగలో క్లీన్‌ఆంధ్ర, గ్రీన్‌ఆంధ్ర

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 2: పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ పరిధిలోని చంద్రప్పనాయుడు కండ్రిగలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సర్పంచు బొబ్బిలి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టారు. రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు.

పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు


రక్తదానం చేస్తున్న వినుత తదితరులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. పలు ప్రాంతాల్లో క్లీన్ అండ్ గ్రీన్, కేక్ కటింగ్, రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన నాయకులు కోట చంద్రబాబు, తోట గణేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని విజ్ఞానగిరి సమీపంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఆధ్వర్యంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ నాయుడు హాజరై పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జసేన నాయకులు మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం సత్యవేడులో ఆపార్టీ మండల అధ్యక్షుడు రూపేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బాలమురళి, హేమంత్‌కుమార్, చెంచయ్య, జ్యోతీశ్వర్, విజయ కుమార్, ప్రసన్నకుమార్, మునిశేఖర్, వెంకటయ్య, జయకృష్ణ, అనిల్ కుమార్ బీజేపీ నాయకులు బండారు మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన మండల అధ్యక్షుడు భాషా ఆధ్వర్యంలో జరిగాయి. నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు కేక్ కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, మధునాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జనసేన మండల అధ్యక్షుడు దేవప్రశాంత్, ఉపాధ్యక్షుడు దూలినేని ప్రేమ్‌బాబు, నాయకులు హేమ కుమార్, వాసురెడ్డి, రవి, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలో ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పార్టీ జెండాను ఆవిష్కరించారు. విప్పమానుపట్టెడలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కోట చంద్రబాబు, నగరం భాస్కర్, జగదీష్, మోహన్, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంలో అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.